క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులపై అవగాహన



సూచనలు ఇస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె, అరగొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తే తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. నారు పోసే సమయంలో విత్తనశుద్ధి తప్పక చేయించాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వాడాలని వివరించారు. క్షేత్రస్థాయిలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు మండల మీట్

గుడిపాల: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజన్ తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు కూడా హాజరు కావాలని ఆయన తెలిపారు.

కలెక్టర్‌తో పోలీసు అధికారుల భేటీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకు బదిలీపై విచ్చేసిన పలువురు పోలీసు అధికారులు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 8వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు కేవీఎన్‌బీ మల్లికార్జున, కట్టెడ సింగయ్య కలెక్టర్‌ను కలిసి శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం

చిత్తూరు కలెక్టరేట్: విజయవాడ వరద బాధితులకు తనవంతు సహాయంగా రిటైర్డ్ హెచ్‌ఎం సాంబశివన్ ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందజేశారు. అనంతరం రిటైర్డ్ హెచ్‌ఎంను కలెక్టర్ అభినందించారు.

అనాథ శవానికి ఆ నలుగురూ!



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: అనాథ శవానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్న వైనం కుప్పంలో బుధవారం చోటుచేసుకుంది. గత నెల 30న ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి బిహార్‌కు చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. వారం రోజులయినా ఆ యువకుని మృతదేహం తీసుకెళ్లేందుకు ఎవరు రాకపోవడంతో రైల్వే పోలీసులు స్థానికుల సాయంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. డి.కె.పల్లికి చెందిన మణి, స్థానికుడు లక్ష్మీనారాయణ, రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తమ బృందంతో కలసి అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతదేహాన్ని గుల్లేపల్లి రోడ్డులోని శ్మశాన వాటికకు తరలించి సంప్రదాయ పద్ధతిలో పూడ్చిపెట్టారు. అనాథశవానికి అంత్యక్రియలు చేయడంపై మణి, లక్ష్మీనారాయణ, నాగరాజులను స్థానికులు అభినందించారు.

నేడు విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

వి.కోట: మండలంలోని తోటకనుమ వద్ద నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రవాణశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి హాజరవుతారని ఆయన ప్రకటనలో తెలిపారు.

గానుగ.. ఆరోగ్య కానుక

ఉన్నత చదువులు చదివిన యువదంపతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరోగ్యకరమైన వంట నూనెను ప్రజలకు అందించడంతో పాటు ఉపాధి కూడా పొందుతున్నారు. అందుకు కొయ్య గానుగ పరిశ్రమను ఎంచుకున్నారు. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో గానుగ ఆడించి నూనె తీసేవారు. ఆ నూనెను వినియోగిస్తే ఎలాంటి రోగాలు దరి చేరేవి కాదు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో విద్యుత్ గానుగల(రోటరీలు, ఎక్స్‌పిల్లర్లు) వాడకం పెరిగింది. క్రమేణ ఎద్దులతో ఆడే కొయ్య గానుగలు అంతరించి పోయాయి.



ఎగువ తవణంపల్లెలో ఎద్దుల కొయ్య గానుగతో నూనె తయారు చేస్తున్న దృశ్యం

- ఆరోగ్యానికి మేలు చేస్తున్న గానుగ నూనె
- అన్ని రకాల నాణ్యమైన వంట నూనెల తయారీ
- కల్తీ ఆహార ఉత్పత్తులకు చెక్ పెట్టేలా పాత పద్ధతిలో నూనెల ఉత్పత్తి
- ఆన్‌లైన్‌లో కొయ్య గానుగతో తయారు చేసిన నూనెల విక్రయం
- గ్రామీణ ప్రాంతంలో విద్యుత్ అవసరం లేని పరిశ్రమ
- ఉపాధి పొందుతున్న యువదంపతులు



గానుగలో నూనె తీసిన తర్వాత కొయ్యను బయటకు తీస్తున్న దృశ్యం

తవణంపల్లె: ప్రస్తుత సమాజంలో నాణ్యమైన ఆహార పదార్థాలు దొరికే పరిస్థితి లేదు. ముఖ్యంగా వంటనూనెల కల్తీ అంతా ఇంతా కాదు. ఏది ఒరిజనల్.. ఏది కల్తీదో తెలియని పరిస్థితి. కల్తీ ఆహార ఉత్పత్తుల కారణంగా జనం అనేకరకాల రోగాల బారిన పడుతున్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వంట నూనెను పాత పద్ధతిలో తయారు చేయడానికి ఉన్నత చదువులు చదివిన విద్యావంతులు ఎగువ తవణంపల్లెకు చెందిన వినోద్ రెడ్డి, భార్య మమతలు ముందుకు వచ్చారు. పట్టణాల్లో ఉద్యోగాలు వదలుకుని పల్లెలో ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించి ఎద్దుల కొయ్య గానుకతో వంటనూనెను తయారు చేసే రంగాన్ని ఎంచుకున్నారు. వారి ప్రయత్నం ఫలించడంతో మంచి ఫలితాలు సాధించి ఉపాధి పొందుతున్నారు. ఎద్దుల కొయ్య గానుగతో తయారు చేసే పలు రకాల నాణ్యమైన వంట నూనెలను ఆన్‌లైన్‌లో మైస్టోర్ యాప్ ద్వారా విక్రయిస్తున్నారు. నాణ్యమైన వంట నూనెను దేశవిదేశాలకు సైతం విక్రయించి కొరియర్‌లో బుక్ చేసి పంపుతున్నారు.

ఆరోగ్యం బాగుండాలంటే..!

కొయ్య గానుగలో అవసరమైన విత్తనాలు తెచ్చి నూనె తీస్తారు. ఎద్దుల గానుగలో వేరుశనగ, నువ్వులు, కొబ్బరి, వెర్రినూగులు, కుసుమ, ఆముదం, ఆవాలు, సన్‌ఫ్లవర్, బాదం, కానుగ, విప్ప, వేప గింజలతో నూనె తీస్తారు. వీటితో పాటు ముంతమామిడి(జీడిపప్పు), సీతాఫలం గింజలతో గానుగలో నూనె తీస్తున్నారు. ఒకసారి గానుగ ఆడడానికి 13 కిలోల గింజలు వేస్తారు. 2 గంటల నుంచి 2.30 గంటల వరకు నూనె తీయడానికి సమయం పడుతోంది. ఇందులో ఉష్ణోగ్రత చాలా తక్కువ ఉండడం వల్ల నూనెలోని పోషకాలు మెండుగా ఉంటాయి. ఎద్దుల కొయ్య గానుగలో ఆడే నూనెతో వంటలు చేస్తే రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని వినియోగదారులు చెబుతున్నారు.

పెరిగిన డిమాండ్...

గ్రామాల్లో పూర్వం విశ్వ బ్రాహ్మణులకు కులవృత్తి అయిన కొయ్యలతో వివిధ రకాల వ్యవసాయ పరికరాలైన మడకలు, ఎద్దులబండ్లు, కొయ్య గానుగ తయారు చేసి ఉపాధి పొందేవారు. వ్యవసాయ యంత్రాలు వినియోగంలోకి రావడంతో కుల, చేతి వృత్తులు తయారు చేసేవారికి ఉపాధి కరువైంది. నాటి నుంచి కొయ్య పనిలో నైపుణ్యం కలిగిన కక్కలమిట్టకు చెందిన ఆర్.కోదండ ఆచారి చాకచక్యంగా ఎద్దుల బండ్లను, ఎద్దుల కొయ్య గానుగలను తయారు చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా సుమారు 200 ఎద్దుల బండ్లను, కొయ్యతో తయారు చేసిన గానుగలను కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఒరిస్సా, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు ఉత్సాహవంతమైన రైతులకు సరఫరా చేశారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం

మండలంలోని ఎగువ తవణంపల్లెలో కుటీర పరిశ్రమగా ఎద్దుల కొయ్య గానుగను ఎంచుకుని ప్రభుత్వం ఉంచి ఆర్థిక సహాయం కోసం ప్రయత్నించినట్లు ఆదర్శ రైతులు వినోద్‌రెడ్డి, మమత తెలిపారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ప్రధాన మంత్రి ఫార్మొలేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద తవణంపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.35 లక్షలు రుణం మంజూరు చేసింది. దీంతో పలు రకాల వంట నూనెలు తయారు చేయడం విస్తరింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎద్దుల కొయ్య గానుగతో వంట నూనెను తీయడంపై ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామని వారు చెబుతున్నారు. ఆసక్తి కలిగిన వారు 9381321079, 9440230052 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



పాత్రకు వస్త్రం కట్టి ఎండలో నూనెను ఆరబెట్టిన దృశ్యం



విక్రయించడానికి సిద్ధంగా పలు రకాల నూనెలు



గానుగలో నుంచి పాత్రలోకి పోస్తున్న నూనె



గానుగ నుంచి తీసిన నూనె

ఇంటి దగ్గరే ఉపాధి..



ఇంటి దగ్గర ఉంటూ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎద్దుల కొయ్య గానుగతో పలు రకాల వంట నూనెల తీసి ఉపాధి పొందుతున్నాం. మేము తయారు చేసే వంట నూనెకు మంచి డిమాండ్ ఉంది. కావసిన వారు ఆన్‌లైన్ బుక్ చేస్తారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఆర్డర్ చేస్తే కొరియర్ ద్వారా పంపుతున్నాం. విశ్వ భారత్ నేచురల్స్ ఎగువ తవణంపల్లె పేరుతో విక్రయాలు జరుపుతున్నాం.

–మమత, ఆదర్శరైతు

కొయ్యలే డిమాండ్



ఎద్దుల కొయ్య గానుగలు తయారు చేయడానికి అనుకూలమైన కొయ్య దిమ్మలు దొరకడం కష్టంగా ఉంది. నేను చిన్న వయసులో కొయ్య పని మా తండ్రి దగ్గర నేర్చుకున్నారు. ఆ నైపుణ్యంతో ఎద్దుల బండ్లు, కొయ్య గానుగలు తయారు చేసి బయట పంపడం సంతోషంగా ఉంది. పురాతన కాలంలో పెద్దలు ఎద్దుల కొయ్య గానుగలను అధికంగా వాడేవారు. దీనిపై పూర్వ వైభవం తీసుకుని రావాలనే ఆశయంతో పనులు చేస్తున్నాను. మా కుటుంబంలో ఇంజినీరింగ్ చదువుతున్న పిల్లలు సైతం నాతో పాటు కొయ్య పని చేయడానికి ఆసక్తి చూపడం సంతోషంగా ఉంది.

–కోదండ ఆచారి, కక్కలమిట్ట

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



చిన్నారికి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

ఐరాల: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ఉచితంగా మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో చంటి పిల్లలకు కాచి చలార్చిన నీటిని తాపించాలన్నారు. పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. బుధవారం కమ్మతిమ్మాపల్లెలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ యాప్‌తో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

పలమనేరు: స్వయం సహాయక సంఘాలకు ప్రొఫైల్ యాప్ ద్వారా ఎన్నో లాభాలుంటాయని మెప్మా పీడీ రాధమ్మ అన్నారు. పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది, ఆర్పీలతో ఆన్‌లైన్ యాప్‌పై ఆమె బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆఫ్‌లైన్‌లోనే సాగడం వల్ల అవకతవకలకు అవకాశం ఉంటుందన్నారు. దీన్ని గమనించిన మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. సభ్యుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాక, సంఘ లావాదేవీలను పారదర్శకంగా చూసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సమాఖ్యకు సంబంధించిన ప్రాథమిక ఆర్థిక, సాంఘిక సమాచారం సైతం ఇందులో లభ్యమవుతుందని తెలిపారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను సైతం ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు వీలుంటుందన్నారు. కమిషనర్ రమణారెడ్డి, జిల్లా టీఈలు కృష్ణవేణి, ప్రమీళ, సీఎంఎం బాబా, సీఓలు, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు పాల్గొన్నారు.

రైతులు ప్రీమియం చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రధాన పంటలకు పంటల బీమా వర్తించాలంటే ప్రీమియం చెల్లించాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కామినాయనపల్లె రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, క్రిమి సంహారక మందుల వాడకంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఉద్యానశాఖ తరఫున రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు సబ్సిడీ అందిస్తున్నామని, అదే విధంగా నూతనంగా రైతులు నాటుకునే మామిడి, కొబ్బరి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, ఉసిరి, చింత పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఉద్యాన సహాయకులు రామచైతన్య తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంగారమ్మ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు



రోడ్డు ప్రమాదానికి గురైన కారు

పూతలపట్టు: దర్శనానికి వెళ్తున్న ఓ కుటుంబానికి పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన చంద్రకళ కుటుంబ సభ్యులు బుధవారం తిరుమలలో దర్శనం ముగించుకుని, కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకుడి దర్శనానికి కారులో వెళ్తున్నారు. అయితే మార్గమధ్యలోని చవటపల్లి వద్ద ఉన్న కల్వర్టును కారు అదుపు తప్పి ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో చంద్రకళ, కుమార్తె పావనికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి బాగుంది. అనంతరం వారు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.



నరహరిపేట సంతలో కూరగాయలు

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు
- మార్కెట్‌లో కొనలేని విధంగా కూరగాయల విక్రయాలు
- వంటనూనె సంగతి సరేసరి
- కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పైపైకి ఎగబాకిన ధరలు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

కొనలేం.. తినలేం..

గుడిపాల: కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సగటు సామాన్యుడు నిత్యావసరాలు, కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తిపోతున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నిత్యావసరాల ధరలు, కూరగాయల రేట్లు పైపైకి ఎగబాకుతుండడంతో ఏం కొనలేక, తినలేక అవస్థలు పడుతున్నాడు. ఆదాయంలో చాలా భాగం వీటికే ఖర్చు చేయాల్సి రావడంతో మిగిలిన అవసరాలు తీరడం లేదు. కుటుంబపోషణకు ప్రత్యేకంగా అప్పు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదు.

ప్రజలకు శాపం..

పెరుగుతున్న ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు శాపంగా మారాయి. ముఖ్యంగా రోజువారీ సంపాదనపై బతికే వారి జీవితం దుర్భరంగా మారింది. పెరుగుతున్న ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. నెలల తరబడి దిగిరాని ధరలతో వంటింట్లో ధరలు మంటలు సెగ పుట్టిస్తున్నాయి.


ధరలు చూస్తే వణుకే...

మార్కెట్‌లో కూరగాయల ధరలను చూసి సామాన్యుడు భయపడుతున్నాడు. కేజీ పచ్చిమిర్చి రూ.80, ఉల్లిపాయలు రూ.55, వంకాయ రూ.80, బీరకాయ రూ.70, కాకరకాయ రూ.60, క్యారెట్ రూ.60, కొత్తమీర కట్ట రూ.40, దొండ, బంగాళదుంప, బీట్‌రూట్ రూ.45, అల్లం రూ.90, కందగడ్డ రూ.80, శ్యామగడ్డ రూ.60 పైనే పలుకుతోంది.

వంటనూనె ధర అమాంతం..

ప్రస్తుత ప్రభుత్వం వంటనూనెల ధరలను అమాంతం పెంచింది. గతంలో పోల్చితే లీటరు ఆయిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు ధర పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో లీటర్ ఆయిల్ ప్యాకెట్ సుమారు రూ.120ల నుంచి రూ.150కి చేరింది. దిగుమతి సుంకం పెరగడంతో ఆయిల్ ధరలను కూడా పెంచినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ధరల అదుపు లేకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంపూర్ణ ఆరోగ్యం కోసం తాజా కూరగాయలు తినాలని వైద్యులు సలహాలు ఇస్తున్నారు. కానీ వాటి ధరలు చూస్తుంటే అమాంతం పెరిగిపోవడంతో తాజా కూరగాయలు సరికదా, పాతవి కొనడానికి కూడా డబ్బులు సరిపోవడం లేదు.


ధరలను నియంత్రించాలి..



పెరుగుతున్న ధరలను కూటమి ప్రభుత్వంలోని పెద్దలు నియంత్రించాలి. పెరిగిన ధరలతో ప్రజలు పౌష్టికాహారం తినలేకపోతున్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, నూనెల ధరలు ఇంత పెద్దఎత్తున ధరలు ఉండడంతో సామాన్య జనం బెంబేలెత్తిపోతున్నారు.

–విశ్వనాథరెడ్డి, వసంతాపురం, గుడిపాల

తప్పని ఇబ్బందులు..



నిత్యావసరాలు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పేదల సంపాదన అంతా వీటికే సరిపోతుంది. పౌష్టికాహారం మాట పక్కన పెడితే మాములు ఆహారాన్ని కూడా తినలేకపోతున్నారు.

–ఢిల్లీబాబు, నరహరిపేట, గుడిపాల

అంతర్జాతీయ గుర్తింపు తెద్దాం

- జేసీ విద్యాధరి

పలమనేరు: గంటావూరులో హస్తకళాకారులు తయారు చేస్తున్న టెర్రకోట బొమ్మలకు అంతర్జాతీయంగా గుర్తింపును తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. ఆమేరకు స్థానిక ఆర్డీఓ భవానితో కలసి గంటావూరులోని టెర్రకోట కాలనీని బుధవారం ఆమె పరిశీలించారు. అక్కడ తయారుచేస్తున్న కళాకండాలను గమనించి ఆశ్చర్యపోయారు. ఇప్పటి దాకా డీఆర్‌డీఏ ద్వారా వారికి కలిగిన మేలును టెర్రకోట సంఘ నేత రామక్రిష్ణ ఆమెకు వివరించారు. ఇంకా కొన్ని యంత్రాలు అవసరమని కోరారు. వీటిని మంజూరు చేసేందుకు కృషిచేస్తామని ఆమె తెలిపారు. ఆపై పట్టణ సమీపంలోని రాధాబంగ్లా ప్రాంతంలో ఎస్టీపీ (సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)నిర్మాణం కోసం భూసేకరణ చేసేందుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. పట్టణంలోని 7.8 ఎంఎల్‌డీ మురుగునీరు పెద్దచెరువులోకి వెళ్లకుండా దాన్ని ఎస్టీపీలో శుభ్రం చేసి ఆనీటిని ఈ ప్రాంతంలోని రైతులకు అందించేలా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని పెద్దచెరువు కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత బుధవారం నగదు విరాళం అందించారు. తవణంపల్లి మండలం పట్నం గ్రామానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా రూ.1,01,116 ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ సిబ్బంది దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు.